# అంతిమ దానం

—సలీం

అన్నపూర్ణమ్మ చావుబతుకుల్లో వుందన్న వార్త ఆ ఊర్ని ఉప్పెనలా తాకింది. ప్రజలు వెల్లువలా వస్తున్నారు ఆమెను చూడడానికి. ఇసుక వేస్తే రాలనంత జనం. అక్కడ కన్నీళ్ల సముద్రాలు మోస్తూ మనుషులు...కృతజ్ఞతాభారంతో వొరిగిపోయారు మనుషులు.

ఆమె మదర్ థెరిస్సా అంత గొప్పది కాకున్నా ఆ ఊరి జనాల్లో దాదాపు అంతటి పేరుంది. దానకర్ణుడి గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు ''మన అన్నపూర్ణమ్మగారు లేరూ. అంతటి దానశీలత...ఆ అంశలో పుట్టిందేమో మహాతల్లి'' అని చేతులెత్తి నమస్కరిస్తారు.

ఆ ఊర్లోనే కాదు, దేశం నలుమూలలా ఆమె సహాయంతో చదువుకుని పెద్ద హోదాల్లో వున్నవాళ్లెందరో ఉన్నారు.

మృదు స్వభావి, సేవాతత్పరురాలైన అన్నపూర్ణ తమ ఊరిలో ఓ బాల వితంతువుకు స్వంత బిడ్డలా సపర్యలు చేసేది. ఆమె అనారోగ్యంతో ఉంటే కన్నతల్లిలా కనిపెట్టుకుని ఉండేది. అందుకే అన్నపూర్ణకు పెళ్లీడు వచ్చాక ఆమె దగ్గరుండి తన ఖర్చుతో పెళ్లి జరిపించింది. స్వతహాగా తెలివిగలదైన అన్నపూర్ణ తన భర్త నమ్ముకున్న శ్రమకు తన తెలివితేటల్ని జోడించి అతని అయిదెకరాల పొలాన్ని పదెకరాలకు పెంచింది.

ఆ బాల వితంతువు చనిపోతూ తన లక్షల విలువ చేసే యావదాస్తీనీ అన్నపూర్ణకు వీలునామా రాసింది. అది తెల్సినరోజు అన్నపూర్ణ ఆనందించలేదు. ఆలోచించింది. తనకు తెలివితేటలున్నా, చదవాలన్నా బలమైన కోరిక వున్నా పేదరికంవల్ల తన చదువు ఆగిపోయింది. తనలోని సేవా దృక్పథం, కరుణవల్లనే ఈరోజు ఇన్ని లక్షల ఆస్తికి వారసురాలైంది. తన చుట్టూ ఎంతమంది దీనులు, మరెంతమంది దురదృష్టవంతులు, కాసంత ప్రేమ కోసం, గుప్పెడు జాలి కోసం, చిటికెడు ఆసరా కోసం అలమటిస్తున్నారో...వారికి తన అవసరం వుందనుకుంది.

భర్తతో తన మనసులోని మాట చెప్పి ''ఈ ఆస్తుల మీద నాకు మనకారం లేదు. మీరు అనుమతిస్తే ఈ డబ్బంతా అన్నార్తులకు, అభాగ్యులకు, అనాథలకు, పేద విద్యార్థులకు దానం చేస్తానండీ'' అంది.

''అన్నపూర్ణా! నేను రెక్కల కష్టాన్ని నమ్ముకున్న వాణ్ని. నాకూ అలాంటి వ్యామోహం లేవు. నీ ఉదాత్తమైన ఆలోచనను నేను ప్రోత్సహిస్తాను. నీలాంటి ఉత్తమురాలు నా భార్య అయినందుకు గర్వపడుతున్నాను'' అన్నాడతను.

అన్నపూర్ణ ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పేదల కన్నీళ్లు తుడవడమే ఆమె ధ్యేయం, అన్నార్తులను ఆదుకోవడమే ఆమె జీవితాదర్శం.

అనుకోకుండా ఆమె భర్త గుండెనొప్పితో పోయేనాటికి ఆమెకు ఆరేళ్ల కొడుకున్నాడు.

వాడికి ఊహ తెలిశాక ఓ రోజు ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ''చూడు నాయనా! మనకిన్ని ఆస్తులున్నాయని, చదువురాకున్నా ఫర్వాలేదని పొరపాటున కూడా అనుకోవద్దు. ఈ ఆస్తి మొత్తం చివరి పైసతోసహా పేదవాళ్లకోసమే ఖర్చు చేస్తాను. నీవు మీ నాన్నగారిలా నీ స్వశక్తిని నమ్ముకో. కష్టపడి చదివి పైకిరా. అంతే తప్ప మన కున్న డబ్బుని నమ్ముకోవద్దు'' అని నచ్చచెప్పింది.

ఆమె కొడుకు ఆనందరావుకి వాళ్ల నాన్నలోని ఔన్నత్యం, వాళ్లమ్మలోని ఔదార్యం రెండూ వచ్చాయి.

చదువులో అంతగా రాణించని ఆనందరావు అరకొర మార్కులతో డిగ్రీ పాసయ్యాడు. ఉద్యోగాల వేటలో పడ్డాడు. ఎన్ని ఇంటర్వ్యూలకు హాజరైనా ఉద్యోగం రాకపోతే ఓరోజు వాళ్లమ్మతో ''మన డబ్బులతో చదువుకుని పెద్ద హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నవాళ్లెందరో ఉన్నారు. వాళ్లకు చెప్పి నాకు ఉద్యోగం వేయించమ్మా'' అన్నాడు.

''నాకు ఇవ్వడం తప్ప ఇచ్చినవాళ్ల దగ్గర తిరిగి తీసుకోవడం నచ్చదు నాయనా. నీకు ముందే చెప్పానుగా. నీ తెలివి, స్వయంకృషితోనే పైకి రావాలని'' అని అన్నపూర్ణమ్మ చెప్పినప్పుడు ఆనందరావు మొదట బాధపడ్డా తరువాత ఆమె పట్టుదలకూ, అంకితభావానికి ముగ్ధుడై ''మరెప్పుడూ నీ మనసు తెలుసుకోకుండా ఏమీ అడగనమ్మా'' అని వెళ్లిపోయాడు.

ఆ తరువాత తాలూకాఫీసులో గుమస్తా ఉద్యోగం దొరికింది. కానీ పెళ్లయినప్పటి నుండీ మనశ్శాంతి కరువైంది. అన్నపూర్ణమ్మ చేసే దానాలు కోడలి కడుపుమంటను రగిల్చాయి.

''లక్షల ఆస్తి దాని పాడెమీద పోసుకుంటోంది. కన్న కొడుకన్న ఇంగితం కూడా లేదు. కనగానే సరా. పందులుకూడా కంటున్నాయి'' అని నోటికొచ్చినట్టు తిట్టేది. ఆమె నోటికి జడిసి ఆనందరావు ఏమీ అనేవాడుకాదు.

అన్నపూర్ణమ్మ నవ్వుతూ అన్నీ వినేది. ''ఆనందరావు ఒక్కడేనా! అందరూ నా కన్నకొడుకులే'' అని కోడల్తో చెప్పేదికాదు. చెప్పినా డబ్బు వ్యామోహంలో కళ్లు పొరలు కమ్మిన తన కోడలికి అర్థంకాదని ఆమెకు తెలుసు. ఎంతెంతలేసి మాటలంటున్నా ఆమె మొహంలో ఆ చిరునవ్వు ఆరిపోయేదికాదు. ఆమెలోని దైవత్వం దివ్వెలా ఆ పెదవులమీద వెలుగుతోనే ఉంటుంది అనుకునేవారంతా.

అన్నపూర్ణమ్మ ఇంట్లో నిత్యాన్నదానం జరిగేది. ఆమె గడప తొక్కి లేదనిపించుకుని వెళ్లిన యాచకులు ఎవ్వరూలేరు. ఆమె చదివిస్తే డాక్టర్లు, లాయర్లు, చివరికి కలెక్టర్లు అయిన అనాథలు కోకొల్లలు. ఆమె తన దగ్గరున్న చివరి పైస కూడా ఖర్చు చేసేనాటికి ఆమెకు డెబ్బైఏళ్లు.

''ఈ ముసల్ది మనల్ని బికారిచేసి ఉన్న ఈ కొంప కూడా ఏ అనాథాశ్రమానికో ఇచ్చేసేలా ఉంది. మేం కూడా అనాథలమే తల్లీ. నీ కడుపున పుట్టిన పాపానికి, దౌర్భాగ్యానికి మేమూ మా పిల్లలు అడుక్కునే స్థితిలోనే ఉన్నాం'' అని ఈసడించేది కోడలు.

ఆ ఇల్లు అన్నపూర్ణమ్మ భర్తకి వారసత్వంగా సంక్రమించింది. దానిపైన అధికారం తన కొడుకు ఆనందరావుదే. అందుకే అన్నపూర్ణమ్మ దాని జోలికి పోలేదు. తన తిండి ఖర్చు కోసం మాత్రం పాతికవేలు ఫిక్సెడ్ చేసి పెట్టింది. తన కొడుక్కి తాను భారం కాకూడదని ప్రతి నెల వడ్డీ కొడుక్కి అందుతుంది. తన తదనంతరం ఆ డబ్బు అనాథాశ్రమానికి చెందాలని వీలునామా వ్రాసి పెట్టింది.

ఆ విషయం తెలియకో లేక తెలిసినా కసికొద్దీ ''ఇల్లంతా గుల్ల చేసి కూచున్నావు. ఇంక మేం మిగిలి వున్నాం. మమ్మల్ని పీక్కుతిను. ఎవర్ని ఉద్ధరిద్దామని బ్రతికి ఉన్నావు తల్లీ. నీవు ఛస్తేగానీ నాకు మనశ్శాంతి ఉండదు'' అని రోజుకొక్కసారైనా తిట్టేది.

అన్నపూర్ణమ్మకిప్పుడు డెబ్బై ఆరేళ్లు. కోడలి కోరిక తీర్చాలనుకుందో ఏమో గుండెల్లో నొప్పి అంటూ పడిపోయింది.

డాక్టర్ శ్రీరాంకి కబురందింది ఆఘమేఘాలమీద పరుగెత్తుకుంటూ వచ్చాడు. అన్నపూర్ణమ్మ చలువ వల్లే అతను డాక్టర్ కోర్స్ పూర్తి చేయగలిగాడు.

ఆమెను పరీక్షించిన ఆనందరావుని పక్కకు పిలిచి ''ఆశలేదు. మహా అయితే ఒకట్రెండు రోజులే. అంద

**అన్నపూర్ణమ్మ ఇంట్లో నిత్యాన్నదానం జరిగేది. ఆమె గడప తొక్కి లేదనిపించుకుని వెళ్లిన యాచకులు ఎవ్వరూలేరు. ఆమె చదివిస్తే డాక్టర్లు, లాయర్లు, చివరికి కలెక్టర్లు అయిన అనాథలు కోకొల్లలు. ఆమె తన దగ్గరున్న చివరి పైస కూడా ఖర్చు చేసేనాటికి ఆమెకు డెబ్బైఏళ్లు.**

రికీ వర్తమానం పంపడం మంచిది'' అన్నాడు శ్రీరాం.

ఆనందరావు అందరికీ టెలిగ్రాంలు ఇచ్చాడు. అన్నపూర్ణమ్మ బలగం చాలా పెద్దది. చుట్టాలూ, పక్కాలూ తను చదివించినవాళ్లూ తన సహాయం పొందిన వాళ్లూ... అందరూ దిగిపోయారు.

ఊరి పెద్దలు ఆనందరావుని పిలిచి ''మీ అమ్మగారికి గొప్ప పేరు ప్రఖ్యాతులున్నాయి. పెద్ద పెద్ద ఆఫీసర్లు కూడా ఆమెమీది కృతజ్ఞతకొద్దీ వస్తారు. వారికి వసతి, భోజనం సక్రమంగా జరిగేటట్లు చూసే బాధ్యత మనందరిదీ. నీ ఆర్థిక పరిస్థితి మాకు తెలుసుకాబట్టి మేం అందరం తలో చేయి వేయాలనుకుని నిర్ణయించుకున్నాము'' అన్నారు.



ఆనందరావు వారికి చేతులెత్తి నమస్కారం పెట్టాడు.

''ఆ బాధ్యత మనందరిదీ కాదు. నాది. దాన్ని సక్రమంగా నిర్వర్తించే శక్తి నాకుంది. మా అమ్మ మనసుకు కష్టం కలిగించే పని ఏదీ తలపెట్టకండి'' అన్నాడు.

రెండోరోజు సాయంత్రం మరలా శ్రీరాం వచ్చి చూసాడు. అన్నపూర్ణమ్మ పరిస్థితి ఈ క్షణమో, మరోక్షణమో అనేట్లు ఉంది.

''మహా అయితే ఇంకో గంట... అంతే'' అన్నాడు ఆనందరావుతో. అతని కళ్లు చెమ్మగిల్లాయి. హాస్పిటల్లో ఎమర్జెన్సీ ఆపరేషన్ ఉందని, మరలా వస్తానని చెప్పి వెళ్లిపోయాడు శ్రీరాం.

అతను వెళ్లిన అరగంటకు అన్నపూర్ణమ్మ తల పక్కకు వాల్చేసింది. అందరూ గొల్లుమన్నారు.

★★★

క్యాంపు నుంచి తిరిగొచ్చిన వెంకటేశుకి అతని భార్య చెప్పింది అన్నపూర్ణమ్మ నిన్న సాయంత్రం ఆరింటికి చనిపోయిందని. అతనికి మొదట శూన్యం కన్పించింది. తర్వాత భూమి బ్రద్దలైనట్లు, ఆకాశం వూడి నెత్తిమీద పడ్డట్లు అన్పించింది.

వెంకటేశుకి అమ్మ ఎలా వుంటుందో తెలియదు. అతని చిన్నప్పుడే చనిపోయింది. నాన్న చెప్పులు కుట్టేవాడు. ఓరోజు రోడ్డుమీద వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకుంటున్న అతని తండ్రిని బలి తీసుకుంది. ఆ శవం పక్కన కూచుని ఏడుస్తున్న వెంకటేశుని అన్నపూర్ణమ్మ అక్కున చేర్చుకుంది.

''మేము మాదిగలం'' అన్నాడు వెంకటేశం దూరంగా జరుగుతూ.

''మనందరిదీ ఒకే కులం. మానవ కులం. నాకు మా బాబు ఆనందరావు ఎలానో నీవూ అంతే'' అంది ఇంటికి పిల్చుకునిపోతూ.

ఇప్పుడు వెంకటేశు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి, పెద్ద ఆఫీసరు.

వెంకటేశు అన్నపూర్ణమ్మగారింట్లోకి అడుగు పెడ్తున్నప్పుడే ''కట్టెలు కావల్సినన్ని తెప్పించి వేయించాను బాబాయ్, గంధపు చెక్కలు కూడా తెప్పించాను'' అని ఎవరితోనో అంటున్న ఆనందరావు కన్పించాడు.

వెంకటేశుని చూడగానే ఎదురొచ్చి కౌగలించుకున్నాడు. కన్నీళ్లు వారధిలా వారి మనసుల్ని ఆప్యాయంగా స్పృశిస్తున్నాయి.

వెంకటేశు అన్నపూర్ణమ్మ కాళ్ల దగ్గర నిలబడి ఆమె మొహంలోకి చూసాడు. ఏదో తేడా...మరోసారి పరిశీలనగా చూసాడు. అవును. తేడా వుంది. ఎప్పుడూ అంటుకుని వుండే చిర్నవ్వు ఆమె పెదవులమీద లేదు. చావు దాన్ని కూడా తుడిచేసినట్లుంది. అతనికి గుండె మెలిపెట్టినట్లయింది.

ఆమె పాదాలమీద భక్తితో తల ఆన్చాడు. ఒక్కసారిగా వెక్కిళ్లతో ఏడుపు తన్నుకొచ్చింది. ఓ పదినిముషాలు అలాగే వుండిపోయాడు.

''వెంకటేశూ ! చేయాల్సిన పనులు చాలా వున్నాయి. ఇకలే'' అంటూ ఆనందరావు కుదిపితే లేవబోతూ ఆగాడు. మరేదో తేడా వుంది. ఇంకోసారి శరీరాన్ని తాకి చూసాడు. అవును తేడా వుంది. శ్వాస పరీక్షించాడు. ఆడుతూ ఉంది.

ఆనందరావుని లాక్కుంటూ పక్క గదిలోకి తీసుకెళ్లాడు.

''అమ్మ చనిపోయిందని డాక్టర్ చూసి చెప్పాడా?'' ఉద్వేగంగా అడిగాడు.

''లేదు. డాక్టర్ వెళ్లిన అరగంటకు అమ్మ తల వాల్చేసింది. మరలా శ్రీరాం రాలేదు. ఏం అలా అడిగావు?'' అన్నాడు అయోమయంగా.

''అమ్మ బ్రతికే వుంది'' అన్నాడు వెంకటేశు సంతోషంగా.

అప్పుడే వచ్చిన శ్రీరాం అన్నపూర్ణమ్మని పరీక్షించి ''అమ్మ కోమాలోకి వెళ్లిపోయింది'' అన్నాడు.

ఆనందరావుకి ఆనందించాలో దుఃఖపడాలో తెలీకుండా ఉంది. ఇప్పటికే ఖర్చు తడిసి మోపెడంతయింది. డాక్టర్ శ్రీరాంని పక్కకి పిలిచి అడిగాడు ''అంటే అమ్మ బ్రతుకుతుందంటావా?''

''లేదు. ఇలా కోమాలోనే పోవచ్చు''

''ఎన్నిరోజులు?''

''ఏమో. ఓ రోజు కావచ్చు. వారం కావచ్చు. నెల కావచ్చు. చెప్పలేం'' అన్నాడు శ్రీరాం.

ఆనందరావుకి గుండెల్లో రాయి పడింది.

''మరికొంచెం అప్పు పుడుతుందేమో ప్రయత్నించి వస్తాను'' అన్నాడు బయలుదేరబోతూ.

శ్రీరాం ఆపేశాడు. ''అమ్మ నీకొక్కడికే అమ్మ కాదు. నాకూ, వెంకటేశుకి, మాలాంటి మరెందరికో కూడా అమ్మ. ఈ బాధ్యతను మోసే అవసరమే కాదు, అధికారం కూడా మాకుంది'' అన్నాడు.

''అవును ఆనంద్. నీవు డబ్బులకోసం ఇబ్బంది పడాల్సిన అవసరమే లేదు. మేమందరం ఉన్నాంకదా'' అన్నాడు వెంకటేశు.

''మీ ఇద్దరికీ తెలియనిదేముంది. ఉపకారం చేసిన వాళ్ల దగ్గరనుంచి ప్రత్యుపకారం తీసుకోవడం అమ్మకు ఇష్టం వుండదు'' అని ఆనందరావు అంటుండగానే చాటునుండి వాళ్ల మాటలు వింటున్న అతని భార్య సుడిగాలిలా దూసుకొచ్చింది.

''అవును. ఇష్టం వుండదు. కానీ కన్నకొడుకును బికారిని చేయడం మాత్రం ఇష్టం. నా బిడ్డల్ని అడుక్కుతినే స్థితికి తీసుకెళ్లడం ఇష్టం. చచ్చింది ముసల్ది. పీడా విరగడైందని ఎంతో సంతోషించాను. అప్పుడే ఛస్తుందా. మమ్మల్ని చంపి కానీ పోదు లేవదు. ఇల్లు తాకట్టు పెట్టడం అయిందిగా. ఇంకేం మిగిలిందీ. నన్ను తాకట్టు పెట్టండి'' అని అరుస్తూ అక్కడ ఆగకుండా లోపలికి వెళ్లిపోయింది.

అరగంటసేపు తర్జన భర్జనలు పడి ముగ్గురూ బైటికొచ్చాక అన్నపూర్ణమ్మలో మరలా ఏదో మార్పు గమనించాడు వెంకటేశు.

ఆమె పెదవులమీద ఎప్పటికిమల్లే అద్భుతమైన చిర్నవ్వు వ్రేలాడుతూ...

శ్రీరాం ఆమెను పరీక్షించి కొన్ని నిముషాల క్రితమే చనిపోయిందని చెప్పాడు.

★